క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి కృషి

మామిడికుదురు: గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని సర్పంచ్ అడబాల తాతకాపు పేర్కొన్నారు. లూటుకుర్రులో మంగళవారం జరిగిన సమావేశంలో పాలకవర్గం బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తైన సందర్భంగా పంచాయతీ వద్ద కేక్ కట్ చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు అందించారు. సర్పంచ్‌తో పాటు పాలక వర్గ సభ్యులను గ్రామస్తులు సత్కరించారు. సమావేశంలో ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, అధికారులు పాల్గొన్నారు.

ఎంఈవోగా హెలీనా

మామిడికుదురు: మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో)గా కోన హెలీనా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రస్తుతం పి.గన్నవరం ఎంఈఓగా పని చేస్తున్నారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన కె.ప్రసాదరాజు అనారోగ్యంతో మరణించడంతో హెలీనాను ఎంఈఓగా నియమించారు. ఆమెను ఉపాధ్యాయ సంఘాల నేతలు కలసి అభినందించారు.

మాతృభాష గొప్పదనాన్ని చాటాలి

అంబాజీపేట: మాతృభాష గొప్పతనాన్ని ప్రతి విద్యార్థి చాటి చెప్పాలని హెచ్ఎం బీర హనుమంతరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ మాతృభాష అమ్మ గోరుముద్ద వంటిదని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని లక్కవరం మంగెన గురయ్య డిగ్రీ కళాశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యప్రసాద్ మాట్లాడుతూ మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. అకడమిక్ డైరెక్టర్ ఏబీ నాయుడు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మలికిపురం ఎంవీఎస్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వం ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలోనూ మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు.

పెద్దింట్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో వేంచేసిన పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థమహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు జరగనున్న ఈ మహోత్సవాలకు ఆలయ కమిటీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలిరోజున చిన్నారులు గరగలను శిరస్సులపై ధరించి, గ్రామస్తులతో కలిసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య రక్ష

మధురపూడి: ఆయుష్మాన్ భారత్ కింద పేదలు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆధార్ ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని రాజమహేంద్రవరం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి స్పష్టం చేశారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కోరుకొండ, గోకవరం మండలాల సచివాలయం, ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ నమోద ప్రక్రియపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎల్‌డీఓ పి.వీణాదేవి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద పోర్టల్‌లో అందుబాటులో ఉన్న కుటుంబాల ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యభద్రత కల్పించడం సాధ్యమవుతోందన్నారు. కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోకవరం ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ రవిచంద్ర, కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్యశాంతి, సచివాలయం కార్యదర్శులు, ఏఎన్ఎం, వలంటీర్లు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించండి

ఆలమూరు: పశుసంవర్ధక శాఖలో వచ్చిన అధునాతన శాస్త్ర సాంకేతిక పద్ధతుల ఆచరణపై పాడి రైతులకు అవగాహన కల్పించి పాడి పరిశ్రమాభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా డీహెచ్ఓ ఎ.జయపాల్ అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.అనిత అధ్యక్షతన నిర్వహించిన ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన పశు వైద్యాధికారులు, ఎల్ఎస్ఏలు, గ్రామ క్షేత్ర సహాయకులకు నిర్వహించిన సమావేశంలో డీహెచ్ఓ పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఉత్తమ సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, గుణ్ణం రాంబాబు, ఉత్తమ పాడిరైతు రెడ్డి సత్తిబాబును పశుసంవర్ధక అధికారులు సత్కరించారు.

జీవనోపాధి అవకాశాలపై పరిశీలన

ఆత్రేయపురం: మండలంలోని ఆత్రేయపురంలో విజయవాడకు చెందిన ఎస్ఆర్ఎల్ఎం బృందం పర్యటించి జీవనోపాధి కల్పించేందుకు అవకాశాలపై పరిశీలన జరిపింది. వైఎస్సార్ క్రాంతిపథం డీపీఓ విజయ్‌కుమార్, ఐబీ ఏపీఎం విజయకుమారి, చేయూత ఏపీఎం శామ్యూల్, మండల ఏపీఎం అప్పలకొండ నేతృత్వంలో సభ్యులు మంగళవారం గ్రామంలోని వివిధ పూతరేకు తయారీ పరిశ్రమలను పరిశీలించారు. పథకం ద్వారా మహిళలకు కల్పించే ఉపాధి అవకాశాలకు పూతరేకుల పరిశ్రమ అనువుగా ఉంటుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. పూతరేకుల తయారీపై అధ్యయనం చేసిన సమగ్ర వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని అధికారుల బృందం తెలిపారు.

వరిపై కాండం తొలుచు పురుగు దాడి

- రైతులు నివారణ చర్యలు చేపట్టాలి
- అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తల సూచన

అంబాజీపేట: వరి పైరుపై కాండం తొలుచు పురుగు అధికంగా కనిపిస్తోందని, రైతులు గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాండం తొలుచుపురుగు ఆశించిన వరి చేలల్లో 30 శాతం వరకు నష్టం కలుగుతుందని తక్షణమే నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంది. అయినవిల్లిలో 8,186, అంబాజీపేటలో 3,095, పి.గన్నవరంలో 5,780, మామిడికుదురులో 1,621, రాజోలు 820, సఖినేటిపల్లిలో 54, మలికిపురంలో 232, ఆత్రేయపురంలో 4,787, ఆలమూరులో 9,900, రావులపాలెంలో 4,614, కొత్తపేటలో 7,813 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పసుపురంగు కాండం తొలుచుపురుగు, ఆడ రెక్కల పురుగు గడ్డిరంగులో ఉండి, ముందు జతరెక్కల మధ్యలో నల్లటిమచ్చ కలిగి ఉంటుంది. కంది గింజ పరిమాణంలో ఉండి గుడ్లు సముదాయాలను ఆకు చివర భాగాన పెడుతుంది. ఒక్కో గుడ్ల సముదాయంలో 200 గుడ్లు ఉండి, గోధుమ రంగు వెంట్రుకలు కప్పబడి రక్షణ పొందుతాయి. ఈ గుడ్లు 5-8 రోజుల్లో పొదగబడిన లార్వాలు బయటకు వస్తాయి. వాటి నోటి నుంచి వెలువడే తీగలాంటి లాలాజలం సహాయంతో కాండం కిందకి వేలాడి నీటి ఉపరితలం వద్ద వరికాండం రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశిస్తాయి. తర్వాత లార్వాలు కిందకి వేలాడి కాండం కణుపు దగ్గర రంధ్రం చేసి కాండం లోపలకి ప్రవేశించి మొవ్వ భాగాన్ని కొరికి తినడం వల్ల మొవ్వ చనిపోతుంది. రెండో సారి పంటను ఆశించిన సమయంలో మొవ్వ తెల్లకంకులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.



ముక్కామలలో వరిపై కాండం తొలుచు పురుగు

అనవసరంగా ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల మిత్రపురుగులను కోల్పోవడమే కాకుండా పంట దిగుబడి తగ్గిపోతుందని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి



వరి పంటలో చిరుపొట్ట దశలో కార్బోజిరాన్ 3జీ గుళికలు 10 కిలోలు ఎకరానికి వేయాలి, లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు వేయాలి. నివారణ చర్యలు చేపట్టకపోతే తెల్లకంకి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ సమయంలోనే గుళికలు తప్పనిసరిగా వేయడం వల్ల పంటను సంరక్షించుకోవడంతో పాటు దిగుబడులు సాధించుకోవచ్చు. గుళికలు వేయలేని పక్షంలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ మందును స్ప్రే చేయవచ్చు.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏఓ, అంబాజీపేట

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్యే రాపాక



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలి

అంబాజీపేట: గృహసారథులు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును అవగతం చేసుకుని జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పసుపల్లిలో మండల జీసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశాలను మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మత పార్టీల రహితంగా సంక్షేమాన్ని అందిస్తుందని ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, పార్టీ మండల నాయకులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు, గంటి శ్రీనివాస్, పిల్లి భాగ్యలక్ష్మి, గంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువవుదాం

మలికిపురం: గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కార్యకర్తలు, నాయకులూ ముందుకు సాగాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని కత్తిమండలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు మంగళవారం శిక్షణ తరగతులు జరిగాయి. ఎమ్మెల్యే రాపాక పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అర్ధమయ్యే విధంగా తెలియజేసేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. పార్టీ అధిష్టానం మీపై ఉంచిన బృహత్తర బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, కెఎస్ఎన్ రాజు, గెడ్డం తులసీ భాస్కరరావు, కొప్పిశెట్టి సీతామహలక్ష్మి, కోళ్ళ వేణుప్రసాద్, గుబ్బల మనోహర్, చింతా రాజబాబు, కొడవటి దొరబాబు, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం గృహ సారథులకు కిట్లను ఎమ్మెల్యే రాపాక అందించారు.



పసుపల్లిలో గ్రామ కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కత్తిమండలో గృహ సారథులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రీ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

అంబాజీపేట: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష రీ సర్వేలు, సరిహద్దుల్లో రాళ్లు పాతుట వంటి పలను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర చెప్పారు. పసుపల్లిలో గ్రామంలో రీ సర్వే సంబంధిచి సర్వే రాళ్లను పాతే విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే రాళ్ల పాతే సమయంలో రైతులు, సరిహద్దుదారులు సహకరించాలన్నారు. భూ రీ సర్వేకు రైతులు, భూ యజమానులు సహకరించి సరిహద్దులను చూసుకోవాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు, భూ సర్వేయర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పసుపల్లిల్లో సర్వే రాళ్లను పరిశీలిస్తున్న జేసీ ధ్యానచంద్ర

సామాజిక న్యాయానికి సీఎం పెద్దపీట



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కిషోర్

రాజోలు: సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి (ఎమ్మార్పీఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ అన్నారు. మంగళవారం రాజోలులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థులకు బడుగు, బలహీన వర్గాలకు కేటాయించి నవశకానికి నాంది పలికారన్నారు. ఎస్సీ సామాజికవర్గంలో మాదిగలకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఈతకోట హేమ సుందర్‌రాజు, నవుండ్రు శ్రీను, తెన్నేటి దిలీప్, నవీన్, మణికంఠ, తేజ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఇజ్రాయిల్ నియామకంపై హర్షం

మామిడికుదురు: ఎమ్మెల్సీ అభ్యర్థిగా దండోరా నాయకుడు బొమ్మి ఇజ్రాయిల్‌ను నియమించడంపై దళిత సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి దండోరా కులానికి చెందిన ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ సీటు ఇవ్వడం ద్వారా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీలపై ఆయన అభిమానాన్ని చాటుకున్నారన్నారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో దళిత సంఘాల నేతలు ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆ దళిత నాయకులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువుదీరిన అభయాంజనేయస్వామి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ తెలిపింది. దీనిలో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు ఏకాహ మహోత్సవ కలశ స్థాపన జరుగుతుందన్నారు. గురువారం ఆలయం వద్ద అన్న సమారాధన ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

వైభవంగా శ్రీపుష్పోత్సవం

రావులపాలెం: మండలంలోని ఊబలంక సర్వమంగళ సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామికి శ్రీపుష్పోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాలకు ఊయల సేవలను నిర్వహించారు.



సర్వమంగళా సమేత ఉమామహేశ్వరస్వామి

అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ కార్యవర్గం

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ రాజోలు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని అమలాపురం పార్లమెంట్ కన్వీనర్ నీతిపూడి సత్యనారాయణ మంగళవారం ప్రకటించారు. రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడిగా మెడబల రాజ్‌కుమార్, కన్వీనర్‌గా మేడిది శ్రీనివాసరావు, సంయుక్త కన్వీనర్‌లుగా జాలెం శ్రీనివాసరాజా, గంటి రవికుమార్, మహిళా కన్వీనర్లుగా గుమ్మాపు పద్మ, చుట్టుగుళ్ల ఆదిలక్ష్మి ఎన్నికయ్యారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

అయినవిల్లి: అదనపు కట్నం తీసుకుని కాపురానికి రావాలని, భార్యను గాయపర్చిన భర్తపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ డి.వెంకట్రావు తెలిపారు. మండలంలోని శానపల్లిలంకకి చెందిన చింతలపూడి దుర్గ తన భర్త నాగేశ్వరరావుతో గొడవపడి తన పుట్టింటికి వెళ్లింది. ఇది తట్టుకోలేక భర్త నాగేశ్వరరావు పుట్టింటిలో ఉన్న తన భార్య దుర్గ వద్దకు వెళ్లి కట్నం తీసుకుని కాపురానికి రావాలని గొడవ చేసి గాయపరిచాడు. బాధితురాలు దుర్గ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

గాయపర్చిన కుమారుడిపై కేసు

అయినవిల్లి: మహిళను కొట్టి గాయపర్చిన కుమారుడిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ డి.వెంకట్రావు తెలిపారు. మండలంలోని మడుపల్లికి చెందిన పులగుర్తి బాబురావుకు ఇద్దరు భార్యలు. అందులో ఒక ఆమె పులగుర్తి గంగను మరో భార్య కుమారుడు వేణు, అతని తల్లి గొడవపడి గాయపరిచారు. దీనిపై బాధితురాలు గంగ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

చురుగ్గా క్రాస్‌బండ్ల ఏర్పాటు

మలికిపురం: దాళ్వా సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా డ్రైన్లపై క్రాస్ బండ్ల ఏర్పాటు పనులు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు పేర్కొన్నారు. మండలంలోని వేప చెట్టు డ్రైన్‌పై పెద తిప్ప వద్ద జరుగుతున్న క్రాస్ బండ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. గోదావరిలో నీటి మట్టం తగ్గినందున ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల సూచనల మేరకు డ్రైన్లలో నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. వరి సాగులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజోలు సబ్ డివిజన్ డ్రైనేజీ శాఖ డీఈ ఆర్.నాగార్జునరావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రొయ్యల చెరువుల వ్యర్థాలు, రొయ్యల చెరువుల నీటిని క్రాస్‌బండ్ల ఎగువకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రైతులు ధైర్యంగా ఈ నీటిని వరి చేల సాగుకు వినియోగించుకోవచ్చని డీఈ అన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివ కుమార్, ఆర్ఐ వేణు, వీఆర్ఓ నూకరాజు, రైతులు తిరుమల గవర్రాజు తదితరులు పాల్గొన్నారు.



పెదతిప్పలో క్రాస్ బండ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతరాయుడు

భారీ అన్నసమారాధన

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయ వార్షిక మహోత్సవాల ముగింపు సందర్భంగా దాతల సాయంతో మంగళవారం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి రాంబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. దూనబోయిన వెంకటరమణ, సత్యవాణి, భావన పట్టాభి రామారావు, పల్లేశ్వరి దంపతులతో మహిళలకు పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. అలాగే రుద్రా గంగారావు, లక్ష్మీ సరస్వతి, రుద్రా రామకృష్ణ, లక్ష్మి దంపతులతో గాజులు, పూలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ నాయకుడు అడ్డగళ్ల నారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

రాజోలు: మండలంలోని ములికిపల్లి గ్రామంలో పేదలకు మంగళవారం అన్నదానం కార్యక్రమం జరిగింది. మలికిపురం మండలం గుబ్బలపాలెం గ్రామానికి చెందిన ది లార్డ్స్ ప్రేయర్ హౌస్ సంస్థ, గ్రామానికి చెందిన స్వర్గీయ సాగి జేసుదాసు కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సేవలను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మట్టా రాంబాబు, నేతల నాని, చిక్క సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు అంకురార్పణ

ఆలమూరు: కోస్తా జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి పర్యవేక్షణలో మార్చి 20న ప్రారంభమయ్యే జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని బుట్టగరగ రూపంలో ప్రజలకు దర్శనమివ్వనున్నారు. ఏటా నెల రోజుల ముందు నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించే గ్రామోత్సవంలో పాల్గొని పూజలను అందుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా నూకాంబిక అమ్మవారికి ప్రీతికరమైన తాటాకులతో తయారు చేసిన బుట్టగరగకు చుట్టూ వేప ఆకులు, చామంతి పూలను మాలగా అలంకరించి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మార్చి ఆరు నుంచి పక్షం రోజుల పాటు ప్రతి రోజు రాత్రి మన్యం నుంచి తీసుకువచ్చిన మోదుగపూలతో తయారు చేసిన గరగతో జాతరలను నిర్వహిస్తామన్నారు. మార్చి 20న పెద్ద జాగరణ, 21న తీర్థం, 22న ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నామాల శ్రీనివాసు, సర్పంచ్ మార్గని కరుణ, మోరంపూడి వాసు, మార్గని యేసు, అత్తిలి ప్రసాద్, జేపీ డి.భాస్కర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



చింతలూరులో బుట్ట గరగ రూపంలో దర్శనమిస్తున్న నూకాంబిక అమ్మవారు